మాటే మంత్రం

సాయంత్రం 4-30 అయింది. లాన్‌లో కూర్చున్న సీతమ్మగారు, రామయ్యగారూ వీధి గేటు వైపు దృష్టి సారించారు. పని అబ్బాయి మొక్కలకి పాదులు చేస్తూ కలుపు మొక్కలు పీకుతున్నాడు.

రామయ్యగారు గవర్నమెంట్ ఎంప్లాయి. రిటైర్ అయ్యారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉన్నత భావాలతో నలుగురికీ తమ చేతనయిన సహా

యం చేస్తూ నలుగురిలో మంచి వ్యక్తులు అని పించుకున్నారు. కొడుకు, కోడలూ డాక్టర్లు. 8 సంవత్సరాల హరీష్ ముద్దుల మనుమడు. సీతమ్మగారి అభిరుచి మేరకు లాన్ ఎప్పుడూ పచ్చగా కళకళలాడుతూ, కంటికి ఆహ్లాదంగా రంగురంగుల గులాబీలతో చూపు మరల్చకుం డా చూసేలా ఉంటుంది. వీధిలో ఆటో ఆగిన చప్పుడయింది. మరుక్షణం గేటు తీసుకొని హరీష్ పరిగెత్తుకుని వచ్చి స్కూలు బ్యాగ్, లంచ్ బాక్స్, షూ విప్పేసి అటూ ఇటూ విసిరేసి, నాన్నమ్మ వీపు మీద చేతులు వేసి ఉయ్యాల ఊగుతూ, తాతయ్యా మీకో గుడ్‌న్యూస్... మా క్లాస్‌లో మా మిస్ ఈ రోజు లెసన్స్ వద్దుగానీ, మీరందరూ మంచి ప్రవర్తన, మంచి మాట లు అంటే ఎలా ఉంటాయో చిన్న స్పీచ్‌లా... ధైర్యంగా చెప్పాలి అంది. ఆ కాంపీటీషన్‌లో నేను ఫస్ట్ వచ్చాను. మా మిస్ ఎంత మెచ్చు కుందో తెలుసా? అంటూ నాన్నమ్మ బుగ్గ మీద కిస్ చేసాడు. అలాగా... అంటూనే రా... హరీష్ అంటూ దగ్గరకి తీసుకున్నారు.

ఫ్రెండ్స్‌తో మాట్లాడడం, ఎవరినీ తిట్ట కుండా అందరితో మంచిగా ఉండడం, బాగా మాట్లడడం అంటూ అందరూ రకరకాలుగా చెప్పారు.

నేను ఏమి చెప్పానో తెలుసా? ఉదయం నిద్రలేవగానే ముందు భూమికి నమస్కరించి, తరువాత భగవంతునికి నమస్కారం చేసి, మన అరచేతుల్ని చూసి కరాగ్రేవసతే లక్ష్మి, కరమధ్యే సరస్వతి, కరమూలే స్థితాగౌరి, ప్రభాతేకర దర్శనము అని శ్లోకం చదవాలి. ఇంట్లో ప్రతి ఒక్కరినీ గుడ్‌మార్నింగ్ అంటూ విష్ చేయడం, చదువుకోవడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకో వడం, మూగజీవులు, పశుపక్ష్యాదుల పట్ల ఆద రంగా ఉండడం, తోటి వారికి సహాయం, విక లాంగుల పట్ల ఆదరణ, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం, అనాధల పట్ల ప్రేమతో మాట్లా డడం, ఓదార్పుగా మాట్లాడడం, మాటల్లో మృ దుత్వం, లాలన, చెదరని చిరునవ్వుతో, ఆత్మ స్థయిర్యంతో - చేసే పనిపట్ల అంకిత భావం, తల్లిదండ్రులను గౌరవించడం, పెద్దల పట్ల విన యంగా ప్రవర్తించడం, గురువుని పూజించడం మొదలైనవి అని చెప్పాను.

ముందుగా మా మిస్ క్లాప్స్ కొట్టి, అందరి తో ఆపకుండా క్లాప్స్ కొట్టించింది తెలుసా... అంటూ తాతయ్య మీసాలు నిమురుతున్న మనుమడికి షేక్‌హాండ్ ఇచ్చి, గుడ్‌బాయ్... అని మెచ్చుకున్నాడు.

నాకు ఇవి అన్నీ మా నాన్నమ్మ నేర్పింది అని మా మిస్‌కి చెప్పాను అంటూ గర్వంగా నాన్నమ్మ వైపు చూసాడు ముద్దుల మనవడు. నాన్నమ్మ నవ్వుతోందిగానీ, కళ్ళు మాత్రం హరీష్ విసిరేసిన బ్యాగ్ మీద ఉన్నాయి.

అమ్మో... నాన్నమ్మ ఎన్నిసార్లు చెప్పింది? దేనినీ విసరకూడదు అని, ప్రతి వస్తువుకీ ప్రాణం ఉంటుంది అనీ... ఆనందంతో విసిరే సాను అని నాన్నమ్మకి సారీ చెప్పి, చకచకా లంచ్ బాక్స్, బ్యాగ్, షూ అన్నీ ఒక ప్రక్కన సర్ది పెట్టాడు. అప్పుడు అంది నాన్నమ్మ... హరీష్ చాలా మంచి బాలుడు... అని.

హరీష్ స్నానం చేసి, డ్రస్ చేసుకుని వచ్చే సరికి నాన్నమ్మ బత్తాయి రసం గ్లాసుతో రడీగా ఉంది. నాన్నమ్మ ఇచ్చిన జ్యూస్ తాగి, గ్లాస్ నెమ్మదిగా టేబుల్ మీద పెట్టి, నాన్నమ్మ దగ్గర చేరాడు. నాన్నమ్మా ఏ వస్తువునీ విసరకూడదు అంటావు కదా! విసిరితే ఏమవుతుంది? దానికి

ఎమ్. చంద్రిక

నొప్పి తెలీదు కదా? దానికి ప్రాణం ఉంది అంటావేమిటి? చెప్పు నాన్నమ్మా అంటు గారాలుపోయాడు.

అది కాదురా బాబూ... వాటికి నొప్పి లేక పోయినా, ప్రాణం ఉండే వస్తువు రా అది కూడా! నీ స్కూల్ బ్యాగ్ చూడు... బుక్స్ పెట్టడానికి ఉపయోగిస్తుంది కదా? అలా ఉపయోగించటమే దాని ప్రాణం. బుక్స్ అంటే సరస్వతి సరస్వతిని అవమానించినట్లు కాదా బుక్స్ విసిరితే? నేను బుక్స్ పెట్టుకోవడానికి ఉపయోగపడ్తూంటే నన్ను విసిరేసాడు అని బ్యాగ్ అనుకుంటుంది. అందుకని ఏదీ విసరకూడదు. చెట్లు చూడు... గిల్లితే పాలు కారుతాయి. కొన్ని చెట్లకి జిగురు పదార్థం వస్తుంది. నిన్ను గిల్లితే ఏడుస్తావు... అవి తమ బాధని పైకి చెప్పలేవు. అవునా, కాదా? అంది.

ఇంతలో కారు హారన్ వినిపించడం, గేటు తియ్యడంతో రయ్యిన కారు లోపలికి వచ్చింది. మమ్మీ... డాడీ... అంటూ పరిగెత్తాడు.

స్కూల్ నుంచి వచ్చేసావా హరీ? అంటూ సుధ కొడుకుని దగ్గరకి తీసుకుంది. మమ్మీ... మమ్మీ... ఈ రోజు స్కూలులో... అంటుండగానే సుధా నీకు ఎన్నిసార్లు చెప్పాలి? హాస్పటల్ నుంచి రాగానే కబుర్లు మొదలుపెట్టవద్దన్నానా? అంటూ హుకుం జారీచేసిన తండ్రిని చూసి, గబగబా స్కూల్ బ్యాగ్ తీసాడు. తండ్రి డిసిప్లిన్ గురించి బాగా తెలుసు హరికి, ఇంట్లో అందరికీ.

సుధ, రవి ఫ్రెషప్ అయి లాన్‌లో కూర్చున్న వారి దగ్గరకి వచ్చారు. హరీష్ మమ్మీకి, డాడీకి స్కూల్‌లో జరిగిన కాంపిటీషన్ గురించి చెప్పాడు. వెరీగుడ్‌రా కన్నా! నీకు చిన్నప్పటి నుంచీ తల్లి, గురువు, దైవం అన్నీ మీ నాన్నమ్మ. నాన్నమ్మ మాటలు నీకు, మాకూ వేదమంత్రాలు. ఇలానే నీవు అన్నిట్లోనూ ఫస్ట్ రావాలి అంటూ అత్తగారిని, మామగారినీ గౌరవంగా చూసి, తనయుడిని దీవించింది.

కాలం వేగంగా పరిగెత్తింది. హరి మెడిసిన్ లోకి వచ్చాడు. నాన్నమ్మ మాటలు తూచ తప్పకుండా పాటిస్తూ, చదువులోనే కాదు... ఆట పాటల్లో... అన్నిరంగాలలో ముందున్నాడు. రవి, సుధ డాక్టర్లుగా మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. సీతమ్మ, రామయ్యగార్లు వృద్ధాప్యంలో తమకు వీలయినంత వరకూ ఇతరులకు సాయం చేస్తూ, ప్రతినెలా పెన్షన్ రాగానే మనుమడిని తీసుకొని అనాధాశ్రమాలకి, వృద్ధాశ్రమాలకీ వెళ్లి పండ్లు, స్వీట్లు పంచి రావడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకి హాజరవుతూ దైవ చింతనతో, కొడుకు, కోడలు, మనుమడి ఆత్మీయతానురాగాలతో ఆనందంగా ఉంటూ చుట్టూ ఉన్నవారిని ఆనందింపజేస్తున్నారు.

కాలం పరిగెడుతూనే ఉంది. రామయ్యగారు నిద్రలోనే కాలం చేసి, తెల్లవారేసరికి అప్పులని, సీతమ్మనీ తీరని ఆవేదనకి గురి చేసారు. కొడుకు, మనుమడు సీతమ్మని అక్కున చేర్చుకొని ఓదార్చారు. కొడుకు, కోడలూ రామయ్యగారి అంత్యక్రియలు ఘనంగా జరిపించారు. అన్నదానం, వస్త్రదానం, గోదానం, భూదానం... అన్ని దానాలూ చేసి నలుగురిలో కొడుకు అంటే ఇలా ఉండాలి... అనిపించుకున్నారు.

హరీష్ నాన్నమ్మని శ్రద్ధగా గమనిస్తూ, దిగులు పడకుండా ఉండడానికి తన శాయశక్తులా కృషి చేస్తున్నాడు. సీతమ్మగారిని తీసుకొని అందరూ కాశీ బయలుదేరారు. రామయ్యగారి అస్థికలు నిమజ్జనం చేయడానికి.

కాశీలో గంగ వద్ద అక్కడి కలుషిత వాతా

వరణాన్ని చూసిన రవి ఆ అపరిశుభ్రతతో ఉన్న నదిలో దిగవద్దు అంటాడు. భర్త సంగతి తెలిసి సుధ నిశ్శబ్దంగా ఉండిపోయింది. అలా బ్రాహ్మ డికి ఇచ్చి కలపడం సుధకి ఇష్టం లేదు. మీరే మీ నాన్నగారి అస్థికలు నిమజ్జనం చేయాలి అని చెప్పాలని ఉంది. కానీ భర్త డిసిప్లిన్ నోరు తెరువనివ్వలేదు.

సీతమ్మగారు తప్పు బాబూ... గంగని ఎంచ కూడదు. గంగా నది ఎంతోమంది పాపులను తనలో ప్రక్షాళనం చేసుకొని, తిరిగి మనకి జీవ నదిగా ప్రవహిస్తుంది. ఎంత కలుషితం చేసినా గంగానది పవిత్రమైనది. పడవలో నదీ గర్భా నికి వెళ్ళి, అక్కడ మీ నాన్నగారి అస్థికలను నెమ్మదిగా నిమజ్జనం చేయాలి... అంటూ కొడు కుతో పడవ మీద నది మధ్యకి వెళ్ళి, నెమ్మదిగా అస్థికల పాత్రని వదలమంది. మీ నాన్నగారికి నీవు చేసే ఈ పని ఆయనని పుణ్యలోకాలకి చేరుస్తుంది అంటూ నమస్కారం చేసుకొని వచ్చి, ఒడ్డున పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకొని విశ్వేశ్వరుని దర్శించుకుని వచ్చారు. దారి పొడవునా తన ప్రశ్నలతో నాన్నమ్మ దిగులుని మరిపిస్తూ తనకి తెలియని క్రొత్త విషయాలు ఎన్నో తెలుసుకున్నాడు హరి.

నాన్నమ్మా... నదీ గర్భంలోనే ఎందుకు కలపాలి అస్థికలని? అన్న ప్రశ్నకి నాన్నమ్మ ఇచ్చిన వివరణ విన్న తరువాత సాంప్రదాయం, పద్ధతుల పట్ల ఆమెకున్న విశ్వాసం, విజ్ఞానానికి; వాటికి ఆచరించే ఆమె నమ్మకానికీ జోహర్లు అర్పించారు సుధ, హరీష్.

మనం తల్లి గర్భంలో ఎలా జన్మిస్తామో, మనకి జీవించటానికి ఉపయోగించే ప్రతి వస్తువూ భూమి మనకి ఇస్తుంది. నీటిని తన గర్భంలోంచి మనకు ప్రసాదిస్తుంది. భూమి మీద పంటలు పండిస్తాం. ఖనిజ లవణాలను భూమిలోంచి తీస్తాం. భూమి మీద చెట్లు మనకి కలప, ప్రాణ వాయువు, పూలు, పండ్లూ అంది స్తున్నాయి. చెట్లు, చేమలు అన్నీ భూమి మీద పండిస్తాం. భూమి, నీరు మనకి జీవితాన్ని ప్రసా దిస్తున్నాయి. పంచభూతాల సాక్షిగా మనం జీవి స్తున్నాం.

పంచభూతాలు అంటే ఏమిటి నాన్నమ్మా?

నింగి, నేల, నీరు, అగ్ని, వాయువు... ఇవి అన్నీ మానవుల మనుగడని క్రమపద్ధతిలో నడి పించే ప్రత్యక్ష దైవాలు. మానవులు చేసే పాపా లను భూమి భరిస్తుంది. పాపులను జీవనదులు ప్రక్షాళనం చేస్తున్నాయి. నదీ స్నానం పాపులను పరిహారం చేస్తుంది. అందుకని గంగని ఎంచ కూడదు. ఉదయం లేవగానే మనం భూమికి భూస్తుతి ఎందుకు చేస్తాం? "సముద్రవసనేదేవి పర్వతస్తనమండలే! విష్ణుపత్ని నమస్తుభ్యం, పాదస్పర్శం క్షమస్వమే॥" సముద్రములే వస్త్రము లుగా కలిగి, పర్వతములే పాలిండ్లుగా కలిగి, లోకపాలకుడగు విష్ణుమూర్తి యొక్క పత్ని అయిన ఓ భూమాతా! నీకు నమస్కారం. నా పాదములను మోపుచున్నాను. క్షమించు... అని ప్రార్థించాలి. పంచభూతాల సాక్షిగా మనం చేసే

హెల్మెట్

నాన్నా... నాకు కూడా హెల్మెట్ కొను... గారాలుపోయాడు రెండో తరగతి చదువు తున్న కొడుకు.

నీకెందుకురా...? ప్రశ్నించాడు తండ్రి ఆశ్చర్యంగా.

మరేమో... మా క్లాస్ టీచర్ అస్తమానూ మొట్టికాయలు వేస్తున్నారు... అందుకు... సమాధానమిచ్చాడు కొడుకు.

ప్రతి పనీ సక్రమంగా చేయాలి.

అందుకని మీ తాతగారి అస్థికలను నదీ గర్భంలో కలిపాం. నదీమ తల్లి తనతో బాటు భూమిలో కలుపుతుంది. మన ప్రతి చర్యా మంచిని పెంచేదిగా ఉండాలిరా బాబూ... అంది. అన్నీ వివరంగా చెప్పిన నాన్నమ్మ వైపు "ఆరాధన"గా చూసాడు హరీష్.

మా నాన్నమ్మ విజ్ఞాన ఖని. ఇంత మంచి నాన్నమ్మతో నేను చాలా ఆత్మీయంగా, ప్రేమానురాగాలు పంచుకోవాలి. నేను చాలా అదృష్టవంతుడిని అనుకొన్నాడు హరీష్.

రోజులు వారాలుగా, వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారుతున్నాయి. కాలం పరుగులు తీస్తూనే ఉంది. తరాలు, అంతరాలు మారుతూనే ఉన్నాయి. హరీష్ మంచి డాక్టరుగా పేరు సంపాదించుకున్నాడు. నాన్నమ్మ, తాతయ్య పేర్ల మీద సూపర్ స్పెషాలిటీని రన్ చేస్తున్నాడు. అందులో బీదలందరికీ ఉచిత వైద్యం. హరీష్ రోగులందరికీ దేవుడితో సమానం.

సుధ ఎప్పుడూ అత్తయ్య వల్లనే మా హరీష్ ఇంతవాడయ్యాడు అంటూ గర్వంగా చెబుతుంది. కాలంతో నడవలేక సీతమ్మగారు తిరుగుతూ, తిరుగుతూనే ఎటువంటి అనారోగ్యం లేకుండా కోడలి చేతిలో కన్నుమూసారు. తన అవశేషాలని బాల్యంలో పెరిగిన విజయవాడలోని కృష్ణానదిలో నిమజ్జనం చేయమని ముందుగానే కోరిందావిడ.

హరీష్ చాలా దిగులు చెందాడు నాన్నమ్మ గురించి. నాన్నమ్మ జ్ఞాపకాలను గుర్తు చేస్తూ సుధ హరీష్‌ని మాములుగా చేయడానికి ప్రయత్నించింది. ఎన్ని అనునయ వాక్యాలు విన్నా నాన్నమ్మ ఎడబాటు హరీష్‌ని చాలా బాధించింది.

నాన్నమ్మ కోరిక ప్రకారం విజయవాడ వచ్చారు. హరీష్ చాలా అపురూపంగా కృష్ణా నదిని చూస్తున్నాడు. హరీష్ మదిలో నాన్నమ్మ తన చిన్నతనంలో అమ్మ చెయ్యి పట్టుకొని కృష్ణా నదిలో స్నానం ఎలా చేసేదో, కృష్ణ ఒడ్డున తన స్నేహితులతో ఆడే ఆటలు, చేసిన పూజలు, నాన్నమ్మ కొన్ని సంవత్సరాల క్రిందట ఇక్కడ తిరిగింది కదా! నాన్నమ్మ చెప్పిన సంగతులు, జ్ఞాపకం చేసుకుంటూ కృష్ణానదిని చూస్తున్నాడు. పరవళ్ళతో ప్రవహిస్తున్న కృష్ణానది చాలా మనోహరంగా ఉంది. కొండమీద దుర్గమ్మ తన చల్లని చూపులతో వీక్షిస్తూ ఉంది. ప్రకాశం బ్యారేజి చాలా అందంగా కనబడుతోంది. అవతల తీరంలో అంజనేయస్వామి గోపురం కనిపిస్తోంది. అలా నది ఒడ్డున నిలబడి రమణీయమైన అందాలను తిలకిస్తున్న హరీష్ నది మధ్యలో పడవలను చూసేసరికి ఈ లోకంలోకి వచ్చాడు. ప్రక్కనే అమ్మ, నాన్న పాత్రలని బ్యాగ్ లోంచి తీస్తూ కనిపించారు. గబగబా పడవలకి టిక్కెట్టు కౌంటర్ వైపు నడుస్తున్న హరీష్‌కి దబ్బున ఏదో నీటిలోకి విసిరేసిన శబ్దం వినిపించింది.

వెనుకకి తిరిగి చూస్తే తండ్రి నాన్నమ్మ "అస్థికల" పాత్రని నదిలోకి విసిరేసాడు. పరుగు పరుగున వెనక్కి వచ్చి, ఏమిటి నాన్నా మీరు చేసిన పని? అలా విసిరేసారు అని అంటున్న కొడుకుని, భార్యనీ చూసి, ఏముంది? నది పరవళ్ళుగా ఉంది. టికెట్టుకి డబుల్ రేటు ఇవ్వండి... అంటున్నాడు. నది పరవళ్ళుగా ఉంది కదా... అవే కొట్టుకుని పోతాయిలే... అంటూ ఉండగానే హరీష్ దబ్బున నీళ్ళలోకి దూకేసాడు. పాత్రకి కట్టిన ఎర్రని గుడ్డ ఇంకా నీటిలో పూర్తిగా మునగలేదు కాబట్టి మణిలా

ప్రకాశిస్తూ కనిపిస్తున్న వైపుకి ఈదుతూ దూసుకు పోయాడు హరీష్. అది చూసిన సుధ బాబూ... అంటూ కుప్పకూలిపోయింది.

హరీష్... ఎంత పని చేసావు... అంటూ తండ్రి దిగ్భ్రాంతిగా చూస్తూ ఉండిపోయాడు. తెప్పరిల్లి బాబూ... బాబూ... అంటూ అరుస్తున్నాడు. చుట్టూ ఉన్న జనం కూడా అవాక్కయి చూస్తున్నారు.

ఈత వచ్చునో లేదో... ఇంతసేపయినా పైకి రాలేదు... అంటూ జనం హాహాకారాలు... కనీసం ఈతగాళ్ళు కూడా లేరేమిటి? అంటూ రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు జనం. దగ్గరలో ఉన్న అధికారులు గజఈతగాళ్ళని రప్పించారు. వారు నదిలోకి దిగారు.

అరగంట గడిచింది. సుధ అత్తగారిని మనస్సులోనే వేడుకుంటోంది... భర్త చేసిన పనికి క్షమించమని, కొడుకుని రక్షించమని. అయినా అదేమిటి? అలా విసిరేసారు? అత్తయ్య పద్ధతులు, విలువలూ తెలిసి కూడా ఇలా చేసారేమిటి? బోటుకి డబుల్ ఎమౌంట్ అడిగాడు అనా? నది పరవళ్ళు తొక్కుతోంది అనా? అస్థికలకి విలువ ఇచ్చేది ఏమిటి అనుకున్నారా? మామయ్య అస్థికలను అత్తయ్య ఎంత పవిత్రంగా నిమజ్జనం చేయించారు? అలా చేయించడం వల్ల మనం వారికి చేసే చివరి సంస్కారం అదే అన్నారు. అన్నీ తెలిసీ ఈయన ఇలా చేసారేమిటి?

బాబూ.. బాబూ... అంటూ పిచ్చిదానిలా అరుస్తోంది. చుట్టూ జనం పోగయ్యారు. అంతా నివ్వెరపోయి చూస్తున్నారు. అరె... అందమైన అబ్బాయి... ఎంత అందంగా ఉన్నాడో చూస్తే కలవారిలా ఉన్నారు... తల్లిదండ్రులు చూస్తూ ఉండగానే అలా దూకేసాడు. ఎందుకని అలా దూకాడో? కలికాలం... ప్రేమ వ్యవహారం అనుకుంటా... జనం కథలు తయారుచేస్తున్నారు. ప్రవాహం బాగా ఉంది. ఈతగాళ్ళు కూడా పైకి రాలేదు. దాదాపు అరగంట అయ్యాక స్పృహతప్పిన హరీష్‌ని భుజం మీద వేసుకొని తీసుకు వచ్చారు. బాబూ... నాన్నా... అంటూ దగ్గరికి వెళ్ళి, కొడుకుని చూసిన డాక్టర్ కొడుక్కి ప్రాణాపాయం లేదుగానీ స్పృహ తప్పాడని గుర్తించాడు. జనం అమ్మయ్య... అనుకొని కదిలారు. హరీష్ చేతుల్లో ఎర్రని గుడ్డ కట్టిన పాత్ర గుండెలకి అదుముకొని గట్టిగా పట్టుకొని ఉన్నాడు. నెమ్మదిగా కనులు తెరుస్తున్నాడు.

క్షణం తనమీద తనకే అసహ్యం వేసింది రవికి. తనని ప్రాణంలా పెంచిన అమ్మకి తాను చేసిన చివరి సంస్కారం ఇదా? తనని ప్రాణంలా పెంచిన అమ్మకి తాను ఇచ్చినవిలువ ఇదా? అంటూ కుమిలిపోయాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచిన హరీష్‌కి చుట్టూ జనం, నీరు నిండిన నయనాలతో అమ్మ, నాన్న కనిపించారు.

క్షమించు నాన్నా, నాన్నమ్మ అస్థికలను మీరు అలా విసిరేయడం భరించలేకపోయాను. నాన్నమ్మ ఏదీ విసరకు నాన్నా... అని నాకు చిన్నప్పటి నుంచీ నేర్పింది. ఆ పాత్రలో నాన్నమ్మ ఉంది అన్న ఫీలింగ్‌తో దూకేసాను. థాంక్ గాడ్... పాత్రని రక్షించగలిగాను అంటున్న కొడుకుతో నన్ను క్షమించరా నాన్నా... నాన్నమ్మ మాటే మంత్రంగా భావించి, నా కళ్ళు తెరిపించావు అన్నాడు మనస్పూర్తిగా.

ముగ్గురూ పడవ ఎక్కి నదీ గర్భం వైపు కదిలారు. పదిలంగా పాత్రని పట్టుకొని... నిమజ్జనం చేయటానికి. ●